నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

3 | నిజామాబాద్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

బాన్సువాడలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు.. ఇబ్బందులు పడుతూ వెళ్తున్న విద్యార్థులు, వాహనదారులు



# జోరువాన

- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- పిడుగుపడి ఇంటికి కరెంట్.. యువతి మృతి
- మరో ఘటనలో వృద్ధుడికి గాయాలు
- మూడు రోజులు అతి భారీ వర్షాలు..
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

### బాన్సువాడ జలమయం

భారీ వర్షాలతో బాన్సువాడ పట్టణం జలమయమైంది. మధ్యాహ్నం వేళ మొదలైన వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగుల హోరుతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రెయినేజీలు పరిశుభ్రంగా లేకపోవడంతో వర్షపు నీరు ప్రధాన రహదారి పై మోకాలి లోతు వరకు నిలిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



బొమ్మన్‌దేవుపల్లిలో ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని ఎత్తిపోస్తున్న స్థానికుడు



బొమ్మన్‌దేవుపల్లిలో మహిళతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

## ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు

నస్రుల్లాబాద్/బాన్సువాడ, ఆగస్టు 31: ఉమ్మడి జిల్లాలో వర్షాలు దంచి కొడుతున్నాయి. శుక్రవారం మొదలైన జోరువాన శనివారం కూడా కొనసాగింది. నిజాంసాగర్, బీర్కూర్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, బాన్సువాడ, బోధన్, రుద్రూర్, చందూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, డిచ్‌పల్లి తదితర మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. మూడ్రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది. జోరువానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు పొంగి కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. పిడుగుపడి వైరు తెగి ఇంటిపై పడడంతో ఓ యువతి మృతి చెందింది. మరోచోట పిడుగు పడి వృద్ధుడు గాయపడ్డాడు. నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవుపల్లిలో అత్యధికంగా 13.7 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.

**పిడుగుపడి గాయాలు..**

బొప్పాస్‌పల్లిలో పిడుగు పడి చవాన్ చిమ్యా నాయక్ (65) తీవ్రంగా గాయపడ్డాడు. పశువులు మేపడానికి అడవికి వెళ్లిన ఆయన పిడుగుపాటుకు గురయ్యాడు. తీవ్ర గాయాలైన అతడ్ని బాన్సువాడ దవాఖానకు తరలించారు.

**మూడు రోజులు భారీ వర్షాలు..**

ఖలీల్‌వాడి, ఆగస్టు 31: అల్పపీడనం వల్ల నిజామాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరోవైపు, శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా వర్నిలో 8,4 సెం.మీ, చందూరు 6.6, మోస్రా 3.38, ఎడపల్లిలో 2.83 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.

### అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు**

కంఠేశ్వర్, ఆగస్టు 31: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని, ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో శనివారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువులు, కుంటల్లోకి చేరే వరదనీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ కూడా గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కచ్చితంగా తమ కార్యస్థానాల్లో ఉండాలని ఆదేశించారు.

**కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**

అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 08462 220183 (కలెక్టరేట్), 08462 295457 (ఆర్డీవో ఆఫీస్)కు కాల్ చేసి సమాచారమివ్వాలని కోరారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఈ కంట్రోల్ రూమ్‌కు సమాచారమందిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. కంట్రోల్ రూమ్‌లలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండాలని, సమాచారాన్ని వెంటవెంటనే అధికారులకు చేరవేయాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీపీవో తరుణ్‌కుమార్, సీపీవో మల్లికార్జున్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఇండ్లలోకి చేరిన నీరు..

బొమ్మన్‌దేవుపల్లిలో భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీల్లో పట్టిక వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. చిన్నగా ఉన్న డ్రైనేజీని తొలగించి కల్వర్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సంగెం,హాజీపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగును ఆమె పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ ఉన్నారు. మరోవైపు, భారీ వర్షాల నేపథ్యంలో అంకోల్ క్యాంపు వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. అంకుల్ క్యాంపు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వర్నినుంచి వస్తున్న వాహనాలు బొమ్మన్‌దేవ్‌పల్లి ఎక్స్‌రోడ్ నుంచి బీర్కూర్ మీదుగా బాన్సువాడకు వెళ్లాలని రెవెన్యూ,పోలీసు సిబ్బంది సూచించారు. బాన్సువాడ, బోధన్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### యువతి దుర్మరణం..



నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన గైని స్వాతి (18) విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం తన చిన్నాన్న ఇంటికని వెళ్లింది. అయితే, అప్పటికే పిడుగు పడి విద్యుత్ వైర్ తెగి ఆ ఇంటిపై పడడంతో ఇల్లంతా కరెంట్ సరఫరా అయింది. ఇంట్లోకి వెళ్లేందుకు స్వాతి డోర్ తీస్తుండగా, షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన ఇంటిని డీటీ బావయ్య, గిర్దావర్ హన్మాండ్లు పరిశీలించారు.



అంకోల్ క్యాంప్ వద్ద రోడ్డు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు నీరు.. వాహనదారుల తిప్పలు

---

# ఆదర్శం గౌరారం

*ఎత్తయిన కొండలు.. కనుచూపు మేర అడవులు.. ప్రకృతితో మమేకమైన బతుకులు.. తరతరాలుగా గౌరారం గ్రామస్తులకు అడవితో అనుబంధం కొనసాగుతున్నది. ఊరు చుట్టూ ఉన్న అడవి ఆ పల్లెబిడ్డలను కన్న తల్లిలా ఆదరిస్తున్నది. కానీ, కొందరి స్వార్థం పచ్చని అడవికి ముప్పుగా మారింది. చెట్లను నరుకుతూ, అటవీ భూములను ఆక్రమించడం గ్రామస్తులను కదిలించింది. దశాబ్దాలుగా ఆధారపడి బతుకుతున్న అడవులను రంక్షించుకునేందుకు ఊరు ఊరంతా ఏకమైంది. కబ్జాకు గురైన భూముల్లో సాగు చేస్తున్న పంటల్లోకి పశువులను వదలడమే కాకుండా గుడిసెలను ధ్వంసం చేశారు. ప్రకృతిని పరిరక్షించేందుకు ఫారెస్టు సిబ్బందితో కలిసి నడుం బిగించిన ఆ గ్రామస్తులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.*

*–గాంధారి, ఆగస్టు 31*

ప్రకృతితో మమేకమైన పల్లె



అటవీ భూమిని కబ్జా చేసి వేసిన పంటలను, గుడిసెను తొలగిస్తున్న గౌరారం వాసులు

సండే స్పెషల్

- కొందరి స్వార్థంతో అటవీభూములు కనుమరుగు
- సంరక్షించుకునేందుకు ఏకమైన ఊరు
- గుడిసెలు, పంటలు ధ్వంసం
- అడవుల రక్షణకు కదిలి.. ఆదర్శంగా నిలిచి

**తరతరాలుగా** పచ్చటి అడవితో మమేకమై బతుకుతున్నారు గౌరారం గ్రామస్తులు. ఊరు చుట్టూ ఉన్న ఎత్తయిన గుట్టలు, పచ్చని చెట్లు.. ప్రకృతి అందాలన్నీ గౌరారం చుట్టుపక్కలే ఉన్నట్లు అనిపిస్తుంటుంది. టేకు, మద్రి, ఇప్ప, తెల్లబిట్ల, సిరుమని, మద్ది వంటి అరుదైన చెట్లతో పాటు మామిడి, మొర్రి, తునికి, జీడి, అల్లనేరేడు, సీతాఫలం వంటి అనేక రకాల పండ్ల చెట్లు ఇక్కడి అడవుల్లో ఉన్నాయి. కాలానుగుణంగా లభించే పండ్లు, కాయలతో పాటు ఇప్ప పువ్వు, తునికాకును సేకరించి ఎండబెట్టి విక్రయించి పొట్ట పోసుకునే వారు. అలాగే, చు ట్టూ అడవి ఉండడంతో పశు సంపదను నమ్ముకున్నారు. మేత కోసం అడవులకు వెళ్లే వారు.

**ఆక్రమణల పర్వం..**

గ్రామస్తులు ఎన్నో విధాలుగా ఆధారపడిన అడవి.. కొందరి స్వార్థం వల్ల మెల్లిగా కనుమరుగు కావడం మొదలైంది. చుట్టుపక్కల తండాలు, గ్రామాలకు చెందిన కొందరు అత్యాశకు పోయి పెద్దపెద్ద చెట్లను నరుకుతూ, ట్రాక్టర్లతో చదును చేసి పంటలు సాగు చేయడం ప్రారంభమైంది. అటవీ విస్తీర్ణం తగ్గిపోతుండడం, అటవీ ఉత్పత్తులు నమ్ముకుని బతుకుతున్న వారికి జీవనాధారం కొరవడడంతో గౌరారం గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు, పశువులకు మేత కూడా కరువైన పరిస్థితి ఏర్పడింది. అడవులు తగ్గిపోతుండడంతో అటవీ జంతువులు ఊరిలోకి వస్తున్నాయి. ఈ పరిస్థితులను గమనించిన గౌరారం గ్రామస్తులు.. ఆయా సమస్యలన్నింటికీ మూలం అడవులు తగ్గడమేనని గుర్తించారు. తల్లి లాంటి అడవిని తిరిగి కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో ఊరంతా ఏకమయ్యారు.

**ఆక్రమణల తొలగింపు..**

రోజురోజుకు అటవీ భూములు ఆక్రమణలకు గురై, చెట్లు కనుమరుగై పోతుంటే తట్టుకోలేక పోయిన గ్రామస్తులు.. అటవీ భూముల రక్షణకు నడుం బిగించారు. ఇటీవలే స్థానిక ఆంజనేయుని ఆలయ ఆవరణలో ఫారెస్టు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగానే అటవీ భూముల రక్షణకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామ శివారులోని అటవీ భూమిని సర్వే జరిపించి అటవీ హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా అడవి భూముల్లో వేసిన గుడిసెలను తొలగించారు. అటవీ భూములను కబ్జా చేసి సాగు చేస్తున్న పంటల్లోకి పశువులను వదిలారు.

**అడవిపైనే ఆధారం..**



తరతరాలుగా గ్రామ ప్రజలందరం అడవి తల్లిని నమ్ముకుని బతుకుతున్నాం. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం కన్న తల్లి లాంటి అడవిని నరికి వేస్తున్నారు. అడవి భూ ముల విస్తీర్ణం తగ్గడంతో చాలా సమస్యలు వస్తున్నాయి. అందుకే గ్రామస్తులమంతా ఏకమై అటవీ భూములను రక్షించాలని నిర్ణయించాం. ఫారెస్టు అధికారులు అటవీ భూములను గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలి.

**- వంజరి శంకర్, గౌరారం గ్రామస్తుడు**

**అడవిని కాపాడే బాధ్యత అందరిది..**



భావి తరాలను దృష్టిలో ఉంచుకొని అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. అడవులు అంతరించి పోతే ప్రకృతి సమతౌల్యం దెబ్బతింటుం ది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. అలాంటి పరిస్థితి రావొద్దంటే అడవులను కాపాడుకోవాలి. మా గౌరారం నుంచి మొదటి అడుగు పడడం ఆనందంగా ఉంది. మిగతా ఊర్లు కూడా ఇలాగే ముందుకు రావాలి.

**- మనోహర్‌రావు, మాజీ సర్పంచ్, గౌరారం**

**ఆదర్శంగా తీసుకోవాలి..**

అటవీ భూముల సంరక్షణకు ముందుకొచ్చిన గౌరారం గ్రామస్తులు అభినందనీయులు. వారిని మిగతా గ్రామాల వారు ఆదర్శంగా తీసుకోవాలి. గ్రామ శివారులోని అడవి భూమి రక్షణ కోసం గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానం చేయడం సంతోషంగా ఉంది. మిగతా గ్రామాల ప్రజలు సైతం అడవుల సంరక్షణకు నడుం బిగించాలి.

**- హిమచందన, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, గాంధారి**

---

# గురుకులంలో విషాదం.. బాలిక మృతి

**విచారణ చేపట్టిన సబ్ కలెక్టర్**

బాన్సువాడ, ఆగస్టు 31: గురుకుల పాఠశాల విద్యార్థిని శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన అంజలి (12) మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. ఇటీవల ఇంటికి వెళ్లిన బాలిక ఈ నెల 27 నుంచి పాఠశాలకు వచ్చింది. గురువారం జ్వరంతో పాటు వాంతులు చేసుకోవడంతో ఉపాధ్యాయులు మందు గోళీలు ఇచ్చి, విశ్రాంతి తీసుకోమని చెప్పారు. శుక్రవారం మరోసారి వాంతులు చేసుకోగా, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పాఠశాలకు వచ్చిన బాలిక తల్లి, ఉపాధ్యాయులు కలిసి అంజలిని బాన్సువాడ ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. అయితే, పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే నిజామాబాద్‌కు తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్ దవాఖానకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అంజలి చనిపోయింది. విద్యార్థిని మృతితో పాఠశాలలో విషాదఛాయలు నెలకొన్నాయి. మరోవైపు ఈ ఘటనపై బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. విద్యార్థిని మృతికి గల కారణాలను ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అలాగే, బాన్సువాడ ఏరియా దవాఖానకు వెళ్లి వివరాలు సేకరించారు. విచారణ జరుపుతున్నామని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు.



అంజలి (ఫైల్)

---

# యూరియా కోసం వచ్చి దుర్మరణం

- గుండెపోటుతో రైతు మృతి
- సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

ధర్పల్లి, ఆగస్టు 31: యూరియా కోసం సొసైటీ గోడౌన్‌కు వచ్చిన ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దుబ్బాకకు చెందిన రైతు మహిపాల్ (52)కు భార్య యమున, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. యూరియా కోసం శుక్రవారం స్థానికంగా ఉన్న సొసైటీ గోడౌన్‌కు వచ్చిన మహిపాల్.. రెండు సంచులు మోసుకెళ్లాడు. మూడో సంచి కోసం గోడౌన్‌లోకి వచ్చి సంచి పైకి లేపుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. అక్కడ ఉన్న తోటి రైతులు సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. హుటాహుటిన ధర్పల్లి దవాఖానకు తరలించేలోగా మృతి చెందాడు. రైతు మృతితో దుబ్బాకలో విషాదఛాయలు నెలకొన్నాయి.



మహిపాల్ (ఫైల్)

---

# డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

- రుద్రూర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్‌లో ఘటన
- నాలుగు రోజుల క్రితమే కాలేజీలో చేరిన విద్యార్థిని
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు
- బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

రుద్రూర్, ఆగస్టు 31 : మండలంలోని అక్బర్‌నగర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లింగవాడ్ రక్షిత (16) వసతిగృహంలోని బాత్‌రూంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. హాస్టల్‌లో చేరిన నాలుగు రోజులకే మృతి చెందడం, తాము రాక ముందే పోలీసులు పోస్టుమార్టానికి తరలించడం, హాస్టల్‌లోని సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన లింగావడ్ రక్షిత నాలుగు రోజుల క్రితమే కళాశాల వసతి గృహంలో చేరింది. అయితే, బాత్‌రూంలో ఉరేసుకొని మృతిచెందినట్లు శనివారం ఉదయం గుర్తించిన తోటి విద్యార్థులు.. వెంటనే కళాశాల అధికారులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులకు సమాచారమివ్వగా, సీఐ జయేశ్ రెడ్డి, ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నాలుగు రోజుల క్రితమే కళాశాల వసతిగృహంలో చేరి, విగతజీవిగా మారడంపై తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు అత్యుత్సాహంతో తల్లిదండ్రులు రాకముందే మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించడంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలుపాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించకుండా అడ్డుకున్నారు. దీంతో వసతిగృహం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, కారకులు ఎవరైనా ఉంటే చర్యలు తీసుకుంటామని ఏసీపీ శ్రీనివాస్ సముదాయించారు. హాస్టల్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా విద్యార్థిని ఆత్మహత్య ఘటనకు సంబంధించిన ముందు దృశ్యాలు రికార్డు కాకపోవడంపై మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్నికల్ సమస్యతో రికార్డు కాకపోయి ఉండొచ్చని ప్రిన్సిపాల్ బాలాజీనాయక్ తెలుపగా.. టెక్నీషియన్‌ను పిలిపించాలని డిమాండ్ చేశారు. పోలీసులు విచారణ చేపడతామని సముదాయించడంతో ఆందోళన విరమించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ జయేశ్ రెడ్డి, రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు.



రక్షిత (ఫైల్)